పంట రుణమాఫీకి దరఖాస్తుల వెల్లువ

- పంట రుణమాఫీ దరఖాస్తుల స్వీకరణ
- ప్రభుత్వానికి కనువిప్పు కలిగే వరకు పోరాడుదాం: బీఆర్ఎస్
- రుణమాఫీ అయ్యే వరకు ఉద్యమిస్తాం: బీజేపీ నాయకులు
- సాంకేతిక కారణాలతో పంట రుణమాఫీ జరగలేదు: ఏవోలు

మెదక్ రూరల్: దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు

మెదక్‌రూరల్, ఆగస్టు 21: రూ.2 లక్షల్లోపు పంట రుణాలు మాఫీ కాని రైతుల నుంచి మెదక్ వ్యవసాయ కార్యాలయంలో బుధవారం ఫిర్యాదులు స్వీకరించారు. మండలంలోని ఆయా గ్రామాల రైతులు దరఖాస్తులను ఏవో శ్రీనివాస్‌కు అందజేశారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు రుణాలు మాఫీ కాని రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఏవో తెలిపారు.

నిజాంపేటలో..

నిజాంపేట, ఆగస్టు 21: నిజాంపేటలోని రైతువేదికలో రైతుల నుంచి దరఖాస్తులను ఏవో సోమలింగారెడ్డి స్వీకరించారు. సాంకేతిక కారణాలతో రూ.2 లక్షల లోపు పంట రుణమాఫీ కాని అర్హులైన రైతుల నుంచి దరఖాస్తులు తీసుకుంటున్నట్లు ఏవో తెలిపారు. ఏవోతో ఏఈవో శ్రీలత, సిబ్బంది ఉన్నారు.

నిజాంపేటలో దరఖాస్తులను స్వీకరిస్తున్న ఏవో

చిలిపిచెడ్‌లో..

చిలిపిచెడ్, ఆగస్టు 21: మండలంలోని చండూర్‌కు చెందిన రైతులు రైతువేదికలో పంట రుణమాఫీ దరఖాస్తులను ఏవో రాజశేఖర్‌గౌడ్‌కు అందజేశారు. రుణమాఫీ కాని వారు, తప్పొప్పులు ఉన్న వారు దరఖాస్తులు చేసుకోవాలని ఏవో తెలిపారు. కార్యక్రమంలో ఏఈవోలు భూపాల్, బీఆర్ఎస్ మాజీ మండల అధ్యక్షుడు నరేందర్‌రెడ్డి, రైతులు ఉన్నారు.

చిలిపిచెడ్: ఏవోకు దరఖాస్తులు అందజేస్తున్న రైతులు

నర్సాపూర్‌లో..

నర్సాపూర్, ఆగస్టు 21: సాంకేతిక కారణాలతో కొంత మంది రైతులకు పంట రుణమాఫీ జరగలేదని ఏవో దీపిక తెలిపారు. నర్సాపూర్ మండలంలో ఇప్పటి వరకు 3 దశల్లో 7295 మంది రైతులకు రుణమాఫీ జరిగిందన్నారు. రైతులు తమ ఫిర్యాదులను రైతు వేదికలో ఏర్పాటు చేసిన గ్రీవెన్స్ సెల్‌లో అందజేయాలని ఏవో తెలిపారు.

నర్సాపూర్: రైతువేదికలో ఫిర్యాదుల స్వీకరణ

చిన్నశంకరంపేటలో..

చిన్నశంకరంపేట, ఆగస్టు 21: పూర్తి స్థాయిలో పంట రుణమాఫీ అమలయ్యే వరకు ఉద్యమిస్తామని బీజేపీ మండల శాఖ హెచ్చరించింది. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు పోగుల రాజు, ఉపాధ్యక్షుడు మేడి శీను, ప్రధాన కార్యదర్శి దశరథ్, ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు మూర్తిశంకర్, కిసాన్ మోర్చా అధ్యక్షుడు రమేశ్, పట్టణ అధ్యక్షుడు రాజు, నారాయణ, నరసింహులు, శేఖర్ పాల్గొన్నారు.


శివ్వంపేటలో మాట్లాడుతున్న కల్లూరి హరికృష్ణ

చిన్నశంకరంపేటలో బీజేపీ నాయకుడు రాజు

శివ్వంపేటలో..

శివ్వంపేట, ఆగస్టు 21: అప్రజాస్వామిక పాలన నుంచి కాంగ్రెస్ ప్రభుత్వానికి కనువిప్పు వచ్చే వరకు బీఆర్ఎస్ పోరాడుతుందని ఎంపీపీల ఫోరం జిల్లా మాజీ అధ్యక్షుడు కల్లూరి హరికృష్ణ అన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పంట రుణమాఫీలో రేషన్ కార్డులో ఒక్కరికే రుణమాఫీ అని చెప్పినా చాలామంది మాఫీ కాలేదన్నారు. మంగళవారం బడిపిల్లల ఎదుట తాను సీఎం అనే సంగతి మర్చిపోయి రేవంత్‌రెడ్డి సోయి తప్పి మాట్లాడారన్నారు. సమవేశంలో బీఆర్ఎస్ మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నేడు బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రుణమాఫీ ధర్నా

- పార్టీ శ్రేణులు భారీగా పాల్గొని విజయవంతం చేయాలి
- జిల్లా అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి

మెదక్,(నమస్తే తెలంగాణ)/ మెదక్ మున్సిపాలిటీ, ఆగస్టు 21: రైతులందరికీ పంట రుణమాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ధర్నా చేస్తున్నట్లు పార్టీ జిల్లా అధ్యక్షురాలు పద్మాదేవేందర్‌రెడ్డి బుధవారం ప్రకటనలో తెలిపారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు ఈనెల 22న ఉదయం జిల్లా కేంద్రంలోని హెడ్ పోస్టాఫీస్ వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ధర్నాలో ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే శశిధర్‌రెడ్డి, నాయకులు కంఠారెడ్డి తిరుపతిరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ మల్లికార్జున్‌గౌడ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బట్టి జగపతి తదితరులు పాల్గొంటారని తెలిపారు. ధర్నాలో రైతులు భారీగా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

నేటి ధర్నాను విజయవంతం చేయాలి

శివ్వంపేట, ఆగస్టు 21: మండల కేంద్రంలోని పీఏసీఎస్ కార్యాలయం ఎదుట రైతులతో నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రమణాగౌడ్ పేర్కొన్నారు. కేటీఆర్ పిలుపు, ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి ఆదేశాల మేరకు రైతులకు షరతులు లేకుండా పంట రుణమాఫీ చేయాలని ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు.

6.95 లక్షలకు వాహనాల వేలం: ఎస్సీ

మెదక్ అర్బన్, ఆగస్టు 21: జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఎస్సీ ఉదయ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో యజమానులు తీసుకెళ్లని వాహనాలను బుధవారం వేలం వేశారు. ఈ వేలం పాటలో 103 వాహనాలకు రూ.6,95,000 వచ్చాయని, ఈ డబ్బును ప్రభుత్వ ఖాతాలో జమ చేస్తామని ఎస్సీ తెలిపారు. మొత్తం 103 వాహనాలను 4 భాగాలుగా విభజించారని, ఈ వేలంలో 66 మంది పాల్గొన్నారని పేర్కొన్నారు. మొదటి, రెండు, మూడు భాగాల్లో 31 వాహనాల చొప్పున, నాలుగో భాగంలో 10 వాహనాలను వేలం వేశారని, మొదటి భాగంలోని 31 వాహనాలకు రూ.1,45,000, రెండో భాగంలోని 31 వాహనాలకు రూ. 1,85,000, మూడో భాగంలో 31 వాహనాలకు రూ.2,00,000, నాల్గో భాగంలో 10 వాహనాలకు రూ.1,65,000 లకు పాటదారులు సొంతం చేసుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్సీ మహేందర్, సాయుధ దళ డీఎస్పీ రంగనాయక్, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

డెమో రైలును ప్రారంభించాలి

ఎంపీకి వినతిపత్రం ఇస్తున్న తపస్ నాయకులు

చేగుంట, ఆగస్టు 21: గతంలో నిజామాబాద్ నుంచి కాచిగూడ వరకు డెమో రైలును మళ్లీ ప్రారంభించాలని మెదక్ ఎంపీ రఘునందన్‌రావుకు తపస్ నాయకులు బుధవారం వినతి ప్రతం అందజేశారు. ఎంపీ సానుకూలంగా స్పందించి కేంద్ర రైల్వే మంత్రితో మాట్లాడుతానన్నారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నవాత్ సురేశ్, జిల్లా ప్రధాన కార్యదర్శి చల్లా లక్ష్మణ్, జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటస్వామి, రాఘవేందర్‌రావు తదితరులున్నారు.

కుక్క కాటుతో వ్యక్తి మృతి

శ్రీనివాస్ (ఫైల్)

చిలిపిచెడ్, ఆగస్టు 21: వీధి కుక్క కాటుతో వ్యక్తి మృతి చెందిన ఘటన చిలిపిచెడ్ మండలంలోని ఫైజాబాద్ గ్రామంలో బుధవారం జరిగింది. కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం.. ఫైజాబాద్‌కు చెందిన మ్యాకల శ్రీనివాస్ (42) కు రెండు వారాల క్రితం వీధి కుక్క కరిసింది. దీంతో అతడిని సంగారెడ్డి ప్రభుత్వ దవాఖానకు తరలించి, చికిత్స చేయించారు. మెరుగైన వైద్యం కోసం ఓ ప్రైవేట్ దవాఖానలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి బుధవారం మృతి చెందాడు.

పోచమ్మ గుడికి రూ.5లక్షల విరాళం

పెద్దశంకరంపేట, ఆగస్టు 21: పట్టణంలోని ప్రియాంకాకాలనీలో నిర్మిస్తున్న ముత్యాల పోచమ్మ గుడికి వ్యాపార వేత్త ఆసూరి మురళీపంతులు రూ.5 లక్షలను విరాళంగా అందజేశారు. గుడి నిర్మాణంలో భాగంగా ఈ చెక్కు అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సుభాశ్‌గౌడ్, ప్రియాంక కాలనీ అధ్యక్షుడు ఫణి, కాలనీవాసులు సతీశ్‌గౌడ్, అనిల్, రామకృష్ణ ఉన్నారు.

ఆలె నరేంద్ర సేవలు చిరస్మరణీయం

పెద్దశంకరంపేట, ఆగస్టు 21: మాజీ కేంద్ర మంత్రి ఆలె నరేంద్ర సేవలు చిరస్మరణీయమని బీజేపీ మండల అధ్యక్షుడు కోనం విఠల్ అన్నారు. బుధవారం స్థానిక కార్యాలయంలో నరేంద్ర జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు శ్రావణ్, కృష్ణ, సుభాశ్, శ్రీహరి తదితరులున్నారు.

ప్రజా రచయిత ముత్యం మృతిపై దిగ్భ్రాంతి

పాపన్నపేట, ఆగస్టు 21: ప్రజా రచయిత, ఉస్మానియా ఆర్ట్స్‌కాలేజ్ మాజీ అధ్యక్షుడు ముత్యం మృతిపై మాజీ ఎమ్మెల్యే శశిధర్ రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. నాలుగు దశాబ్దాల పాటు రచయితగా, సాహితీ పరిశోధకుడిగా ఆయన అద్భుతమైన పరిశోధన చేశాడని కొనియాడారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

రైస్‌మిల్లు యజమానిపై చర్యలు తీసుకోవాలి

నిజాంపేట, ఆగస్టు 21: నిజాంపేటలోని శివ రైస్‌మిల్లు యజమానిపై చర్యలు తీసుకోవాలని మాజీ ఉప సర్పంచ్ కొమ్మాట బాబు కోరారు. బుధవారం ఆయన మాట్లాడుతూ మెదక్- సిద్దిపేట ప్రధాన రహదారి పక్కనున్న శివ రైస్‌మిల్లు చుట్టూ ప్రహరీ లేక అందులో నుంచి వచ్చే ఊక పొట్టు రోడ్డుపైకి రావడంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారన్నారు. యజమానిపై చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను బాబు కోరారు.

మత్తు పదార్థాలకు యువత బానిస కావద్దు

రామాయంపేటలో అవగాహన కల్పిస్తున్న ఎస్సై బాల్‌రెడ్డి

రేగోడ్‌లో మత్తు పదార్థాల వినియోగంపై అవగాహన

పాపన్నపేటలో అవగాహన కల్పిస్తున్న ఎస్సై శ్రీనివాస్‌గౌడ్

- **మాదక ద్రవ్యాలపై విద్యార్థులకు అవగాహన**

రామాయంపేట, ఆగస్టు 21: విద్యార్థులు మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాల బారిన పడి జీవితాన్ని నాశనం చేసుకోవద్దని ఎస్సై బాల్‌రెడ్డి అన్నారు. బుధవారం రామాయంపేటలోని వివేకానంద విద్యాలయంలో విద్యార్థులకు మాదకద్రవ్యాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్ఎం రామ్‌కుమార్, ఏఎస్సై మల్లికార్జున్ ఉన్నారు.

రేగోడ్‌లో..

రేగోడ్,ఆగస్టు 21:మండల కేంద్రంలో గాంధీ చౌక్ వద్ద ఎస్సై పోచయ్య ఆధ్వర్యంలో మత్తు పదార్థాలపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ గంజాయి,డ్రగ్స్ పై ప్రజలకు,యువతకు అవగాహన సదస్సు ఏర్పాటు చేసి వాటిపై తగు సూచనలు చేశారు.పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పెద్దశంకరంపేటలో..

పెద్దశంకరంపేట, ఆగస్టు 21: మత్తు పదార్థాలకు ప్రతిఒక్కరూ దూరంగా ఉండాలని ఎస్సై శంకర్ అన్నారు. జాతీయ రహదారి 161 ఉత్తులూర్ అండర్ పాజ్ బ్రిడ్జి వద్ద మత్తు పదార్థాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. గంజాయి, మత్తు పదార్థాలతో కలిగే అనర్థాలను వివరించారు.

పాపన్నపేటలో..

పాపన్నపేట, ఆగస్టు 21: విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఎస్సై శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. పాపన్నపేట ప్రభుత్వఉన్నత పాఠశాలలో మత్తు పదార్థాలు, సైబర్ క్రైమ్, తదతర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్ఎం మహేశ్, టీచర్లు వెంకటేశం, అంజాగౌడ్, యాదయ్య, మోహన్‌రావు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు

పెద్దశంకరంపేటలో అవగాహన కల్పిస్తున్న ఎస్సై శంకర్

బీవీఆర్ఐటీలో ఘనంగా ఇండక్షన్ ప్రోగ్రామ్

కార్యక్రమంలో పాల్గొన్న యాజమాన్యం, అధ్యాపక బృందం

నర్సాపూర్, ఆగస్టు 21: నర్సాపూర్ సమీపంలోని బీవీఆర్ఐటీ కళాశాలలో ఇండక్షన్ ప్రోగ్రామ్‌ను బుధవారం అట్టహాసంగా నిర్వహించారు. ఫ్రెషర్స్‌కు గ్రాండ్ ఇండక్షన్ కార్యక్రమంతో ఘనంగా స్వాగతం పలికారు. సంస్థ సమగ్ర పాఠ్యాంశాలు, వేదిక్, ఈ-బాజా వంటి కార్యక్రమాలతో విద్యార్థుల విజయానికి, నిబద్ధత, ఆశాజనక ప్లేస్‌మెంట్స్ గురించి ప్రిన్సిపాల్ సంజయ్ దూబే వివరించారు. డైరెక్టర్ డాక్టర్ లక్ష్మీప్రసాద్, సెక్రటరీ ఆదిత్య విస్సామ్ మాట్లాడుతూ కళాశాల విజన్, బలమైన విద్యా నాయకత్వం, అభివృద్ధిని పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తున్న జీఎస్ఏసీ, అధునాతన ల్యాబ్‌లు, అత్యాధునిక సౌకర్యాల గురించి తెలిపారు. కార్యక్రమంలో హ్యాకథాన్‌లు, ఫెయిలథాన్‌లు, వివిధ పాఠ్యేతర కార్యకలాపాలతో వృద్ధి ప్రమాణాలను పంచుకున్న విద్యార్థుల నుంచి స్ఫూర్తిదాయకమైన ప్రసంగాలను ప్రదర్శించారు.

ఎస్సీ వర్గీకరణపై మాల మహానాడు నిరసన

మెదక్ మున్సిపాలిటీ: నిరసన వ్యక్తం చేస్తున్న మాల మహానాడు నాయకులు

మెదక్ మున్సిపాలిటీ, ఆగస్టు 21: ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు తీర్పును వ్యతిరేకిస్తూ మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు సంజీవ ఆధ్వర్యంలో బుధవారం బస్ డిపో వద్ద నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు పెంటయ్య, శివ, రమేశ్, ప్రసాద్, నరేశ్, సిద్దిరాములు పాల్గొన్నారు.

బంద్ ప్రశాంతం

నిజాంపేట, ఆగస్టు 21: ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు తీర్పును నిరసిస్తూ నిజాంపేటలో మాల మహానాడు ఆధ్వర్యంలో భారత్ బంద్ చేపట్టారు. బంద్‌కు వ్యాపార, వాణిజ్య సంస్థలు సహకరించాయి. వాటి యజమానులకు మాల మహానాడు మండల అధ్యక్షుడు చంద్రయ్య, సభ్యులు లక్ష్మణ్, చంద్రం, సంజీవ్ కృతజ్ఞతలు తెలిపారు.

నిజాంపేటలో మూసిఉన్న దుకాణాలు

'గ్రౌండ్ బెస్ట్ లెర్నింగ్'ను విజయవంతం చేయాలి

- కలెక్టర్ రాహుల్‌రాజ్

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్ మున్సిపాలిటీ, ఆగస్టు 21: గ్రౌండ్ బెస్ట్ లెర్నింగ్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లాలో ఎంపిక చేసిన 20 మంది విషయ నిపుణులకు గణితం, భౌతిక, రసాయన, జీవశాస్త్రాలపై డీఈవో రాధాకిషన్‌తో కలిసి గ్రౌండ్ బెస్ట్ లెర్నింగ్ కార్యక్రమంపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు తరగతి గదిలో నేర్చుకున్న అంశాలను అర్థవంతంగా ఉపయోగించుకునేలా కంటెంట్ రూపొందించాలన్నారు. వివిధ పాఠశాలల నుంచి ఎంపిక చేసిన విషయ నిపుణులకు సలహాలు సూచనలు చేశారు. 6 నుంచి పదో తరగతి వరకు తరగతుల వారీగా, ఆయా సబ్జెక్ట్‌ల వారీగా కంటెంట్ తయారు చేసి జిల్లా వ్యాప్తంగా అన్ని పాఠశాలల్లో అమలుచేయాలని కలెక్టర్ ఆదేశించారు. కాన్ఫరెన్స్‌లో అకాడమిక్ మానిటారింగ్ అధికారి సుదర్శన మూర్తి, జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి, వివిధ పాఠశాలల విషయ నిపుణులు పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు

- వైద్యాధికారులకు మెమోలు జారీ
- జిల్లా వైద్యాధికారి శ్రీరామ్

పీహెచ్‌సీలో తనిఖీ చేస్తున్న జిల్లా వైద్యాధికారి

పాపన్నపేట, ఆగస్టు 21: విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా వైద్యాధికారి శ్రీరామ్ హెచ్చరించారు. బుధవారం ఆయన పాపన్నపేట పీహెచ్‌సీని తనిఖీ చేశారు. సారిక, ప్రదీప్‌రావు ఇద్దరూ విధుల్లో లేకపోవడంతో ఒక రోజు జీతం నిలుపుదల చేస్తూ, మెమోలు జారీచేశారు. పాపన్నపేటలో వారంతపు సంత జరుగుతుంది. గ్రామాల నుంచి ప్రజలు వస్తుంటారు. ఈ రోజు కూడా విధులకు హాజరుకాకుంటే ఎలాగంటూ ఆగ్రహం వ్యక్తంచేశారు. వారిపై వైద్యాధికారి అసహనం వ్యక్తంచేశారు. అనంతరం రికార్డులు, మందులను తనిఖీ చేసి, పరిసరాలను పరిశీలించారు. ఆయన వెంట నవీన్, చందర్ తదితరులు ఉన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న విద్యార్థులు

నర్సాపూర్, ఆగస్టు 21: పెండింగ్ స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు సంతోష్ డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నర్సాపూర్‌లోని ఆర్డీవో కార్యాలయం ఎదుట విద్యార్థులు ధర్నా చేశారు. అనంతరం ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరేండ్ల నుంచి విద్యార్థులకు ఇవ్వాల్సిన ఫీజులు ప్రభుత్వం చెల్లించడం లేదన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి తక్షణమే స్పందించి సమస్యను పరిష్కరించాలని, లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా కలెక్టరేట్లు ముట్టడిస్తామని హెచ్చరించారు. మండలంలోని ఆయా గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పించాలని ఆర్డీవోకు వినతి పత్రం అందజేశారు. నాయకులు జగన్, రమేశ్, వర్ధన్, ప్రవీన్, కిరణ్, ఆకాశ్, రమేశ్, ప్రసాద్, కాంతి, హేమంత్ పాల్గొన్నారు.

రామాయంపేట అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు

రామాయంపేట, ఆగస్టు 21: మున్సిపాలిటీలోని వార్డుల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు తయారు చేస్తున్నామని పురపాలిక చైర్మన్ పల్లె జితేందర్‌గౌడ్ తెలిపారు. బుధవారం బస్తీబాటలో భాగంగా 8, 6, 11, 12వ వార్డుల్లో పర్యటించి, సమస్యలు తెలుసుకున్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ పుట్టి విజయలక్ష్మి, కమిషనర్ దేవేందర్, మేనేజర్ శ్రీనివాస్, పీఏసీఎస్ చైర్మన్ చంద్రం పాల్గొన్నారు.

జీరో బిల్లులకు దరఖాస్తులు చేసుకోవాలి

రామాయంపేట, ఆగస్టు 21: పురపాలికలోని వారు విద్యుత్ జీరో బిల్లుకు ఆప్షన్ వచ్చిందని, వెంటనే తమ దరఖాస్తులను కార్యాలయంలో అందజేయాలని పురపాలిక చైర్మన్ పల్లె జితేందర్‌గౌడ్ అన్నారు. బుధవారం తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ పురపాలికలోని కోమటిపల్లి, గొల్పర్తి, గిరిజన తండాలు, కేసీఆర్ కాలనీ, బీసీ, రెడ్డి, టీచర్స్ కాలనీలవాసులు జీరో బిల్లు కోసం దరఖాస్తులు అందజేయాలని తెలిపారు.

డెంగీతో యువకుడు మృతి

శాంతికుమార్ (ఫైల్)

చిన్నశంకరంపేట, ఆగస్టు 21: మండలంలోని శాలిపేటకు చెందిన యువకుడు డెంగీతో బుధవారం మృతి చెందాడు. స్థానికుల తెలిపిన వివరాల ప్రకారం.. శాలిపేటకు చెందిన సిద్దిరాములు, తులసికి ఇద్దరు కుమారులు శాంతికుమార్, క్రాంతి కుమార్. పెద్ద కుమారుడు శాంతికుమార్(25) బీఫార్మసీ పూర్తి చేశాడు. నాలుగు రోజుల క్రితం జ్వరం రాగా కుటుంబ సభ్యులు మెదక్‌లోని ఓ ప్రైవేట్ దవాఖానకు తీసుకెళ్లారు. తెల్ల రక్తకణాలు పూర్తిగా పడిపోయాయని, మెరుగైన వైద్యం కోసం బంజారాహిల్స్‌లోని ఓ ప్రైవేట్ దవాఖానకు తరలించారు. అక్కడ వైద్య పరీక్షలు చేయగా డెంగీగా నిర్ధారణ అయ్యింది. బుధవారం చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో శాంతికుమార్ మృతిచెందాడు.

చేగుంటలో దంచికొట్టిన వాన

చేగుంటలోని మక్కరాజిపేట రోడ్డులోని హెచ్‌పీ పెట్రోల్ బంక్‌లో చేరిన నీరు

చేగుంట, ఆగస్టు 21: చేగుంటలో బుధవారం వర్షం దంచి కొట్టింది. కాలనీలు, రోడ్డు పక్కన ఉన్న పెట్రోల్ బంక్, పలు పరిశ్రమల వద్ద వరద భారీగా చేరడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. బోనాల్ రోడ్డులో వర్షానికి రహదారి కనిపించక హైదరాబాద్‌కు వడ్లలోడ్‌తో వెళ్తున్న లారీ అదుపు తప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టి బోల్తాపడింది. వర్షంతో కుంటలు, చెరువుల్లోకి వరద భారీగా చేరింది.

మక్కరాజిపేట రోడ్డులోని వెంకబ్ పరిశ్రమ గెట్‌లోపలికి చేరిన వరుద

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

చేగుంట, ఆగస్టు 21: ఎదురెదురుగా రెండు బైకులు ఢీకొని ఒకరు మృతి చెందారు. మరొకరికి తీవ్రగాయాలైన ఘటన నార్సింగి పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. చేగుంట మండలం వల్లభపూర్‌కు చెందిన నేనావత్ మంత్య (45), శంకర్ నార్సింగిలో దిచక్రవాహనాలపై ఎదరెదురుగా వస్తూ ఢీకొన్నారు. దీంతో మంత్య అక్కడికక్కడే మృతి చెందాడు. శంకర్‌కు తీవ్రగాయాలయ్యాయి. స్థానిక దవాఖానలో చికిత్స చేసి, మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ దవాఖానకు తరలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రామాయంపేట ఏరియా దవాఖానకు తరలించారు. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై హైమద్ మొయినోద్దీన్ తెలిపారు

బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం

శివ్వంపేట, ఆగస్టు 21: మండలంలోని అల్లీపూర్‌లో ఇటీవల మృతిచెందిన నిమ్మల యాదయ్య, మన్నె శంకరయ్య కుటుంబాలు, బైక్ ప్రమాదంలో గాయపడిన మార్కంత శేఖర్‌ను మాజీ జడ్పీటీసీ పబ్బ మహేశ్‌గుప్తా బుధవారం పరామర్శించారు. ఒక్కో కుటుంబానికి రూ.5వేల చొప్పున ఆర్థిక సాయం, నెలకు సరిపడా నిత్యావసర సరుకులు అందజేశారు. ఆయనతో మాజీ సర్పంచ్ సుగుణ శ్రీనివాస్, బీఆర్ఎస్ నాయకులు పిట్ల శ్రీనివాస్, తాళ్ల రఘుగౌడ్, సాధు రాములు, చింతకాయల మహేశ్, రాజు, సాధు చిన్న కృష్ణ, చింతకింది గోపాల్, మన్నె శివరాములు, నిమ్మల నర్సింలు, నర్ర ఎల్లయ్య, సాధు ఆంజనేయులు పాల్గొన్నారు.

ఈ రోడ్డు బాగు చేయరూ..

కొల్చారం, ఆగస్టు 21: మండలంలోని దుంపలకుంట చౌరస్తాలోని ప్రతీ మంగళవారం నిర్వహించే కూరగాయల మార్కెట్ రోడ్డు పూర్తిగా బురదమయమైంది. జోగిపేట నుంచి దుంపల కుంట, రంగంపేట మీదుగా పాపన్నపేట వరకు, కౌడిపల్లి నుంచి ఎనగండ్ల, పైతర, కోనాపూర్ వరకు గల గ్రామాలు, తండాల్లోని రైతులు పండించిన కూరగాయలు ఈ మార్కెట్‌కు వస్తాయి. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు దుంపలకుంట నుంచి ఎనగండ్లకు పోయే బీటీ రోడ్డు బురదమయం కావడంతో రైతులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ రోడ్డుకు మరమ్మతులు చేయాలని స్థానికులు కోరారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
WANTED
★ త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. Ph: 9160900024 / 9640400073.
NT-325792-All
గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న, లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్